ముంపు సమస్య ఉండొద్దు

- మూసీ పునరుజ్జీవమే శాశ్వత పరిష్కారం
- ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో వరద, ముంపు సమస్యకు మూసీ పునరుజ్జీవమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధకారులను ఆదేశించారు. వర్షాకాలంలో నగరంలో తరచుగా సంభవిస్తున్న ముంపు, వరద, ట్రాఫిక్ సమస్యలపై సిఎం రేవంత్ శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. వరద నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులు ఉండటమే ముంపునకు ప్రధాన కారణమని అధికారులు సిఎంకు వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో వరద నీటి సమస్య పరిష్కారానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు.వరదనీరంతా మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చెరువులు, నాలాలు, కాలువలన్నీ మూసీకి అనుసంధానించాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల వెడల్పు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తాగునీరు, వరద నీరు, డ్రైనేజీలు, ట్రాఫిక్ వ్యవస్థలను మరో వందేళ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని కొత్త ప్రణాళిక సిద్ధం చేయాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్లో గురువారం రాత్రి కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కొన్ని ప్రాంతాల్లో 15 సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు జిహెచ్‌ఎంసి పరిధిలో సాధారణంతో పోలిస్తే 16 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైంది. అందుకే వాతావరణ మార్పులు, భారీ వర్షాలతో తలెత్తే ఈ విపత్కర పరిస్థితులను అధిగమించేందుకు విపత్తుల నివారణ నిర్వహణ ప్రణాళిక సమర్థవంతంగా అనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎంత వర్షం పడినా గ్రేటర్ హైదరాబాద్ సిటీలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, వరద నీటితో ముంపు గురవకుండా, లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా సురక్షితంగా ఉండేలా అత్యంత పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని, అందుకు వీలుగా రూపొందిస్తున్న మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో 55 కిలో మీటర్ల పొడవునా మూసీని పునరుద్ధరించడం ద్వారా పరివాహక ప్రాంతంతో పాటు నగరంలో ఉన్న అన్ని ప్రాంతాలు, కాలనీలు, లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురవకుండా సురక్షితంగా ఉంటాయన్నారు.

హుస్సేన్ సాగర్, దుర్గం చెర్వు, మీర్ అలం చెర్వులతోపాటు ప్రతీ చెరువు, కుంటలను నాలాల ద్వారా మూసీకి అనుసంధానం చేయాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణ, నాలాలను వెడల్పు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రైనేజీల ద్వారా వచ్చే నీటిని ఎన్‌టిపి (సీవరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్ల) ద్వారా శుద్ధి చేసి మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. నగరంలో ఎక్కడ వర్షం పడినా నీరు చెరువుల్లోకి, నాలాల్లోకి, అటునుంచి మూసీలోకి చేరేలా అనుసంధానం జరగాలన్నారు.

మూసీలో స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో హైదరాబాద్‌లో నీటి కష్టాలు తీరుతాయని సిఎం అన్నారు. కలుషితమైన నీటితో మూసీ పరివాహక ప్రాంతంలో రైతులు పంటలు పండిస్తున్నారని, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఇకపై ఈ పరిస్థితి తలెత్తకుండా మూసీలో నిరంతరం శుద్ధి చేసిన నీటి ప్రవాహం ఉండేలా శాశ్వత ప్రణాళికలు ఉండాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఇతర అవసరాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకునే వీలుంటుందని అన్నారు. భవిష్యత్‌లో వందేళ్ల పాటు మహానగరంలో వరద నీటి సమస్య పునరావృతం కాకుండా ఉండాలంటే మూసీ పునరుజ్జీవనమే అవసరమని సిఎం అభిప్రాయపడ్డారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వరద నీటి నిర్వహణకు వీలుగా డిజైన్ చేయాలని, ఆ దిశగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రత మరింత పెరుగుతుండటంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పాతనగరంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెడిస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. చార్మినార్, సాలార్ జంగ్ మ్యూజియం, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి ప్రాంతాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మల్టీ లెవెల్ పార్కింగ్ జోన్‌ల ఏర్పాటుతో రోడ్లపై వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సిఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, హెచ్‌ఎండిఎ పరిధిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ ఇలంబర్తి, ఎంఆర్డీసీఎల్ ఎండి ఇవి నర్సింహారెడ్డి, జెఎండి గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముంపు సమస్యపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

సిపిఎం నేతలను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

బిసి రిజర్వేషన్ల దీక్షపై పోలీసుల ఓవర్ యాక్షన్

- అనుమతి లేదంటూ టెంట్ కూల్చివేత
- నాయకుల అరెస్ట్, విడుదల
- సిపిఎం కార్యాలయంలో దీక్ష కొనసాగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ చౌరస్తాలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరం వద్ద పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. అనుమతి లేదంటూ టెంట్‌ను కూల్చేశారు. అక్కడ కూర్చున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్, జిల్లా నాయకత్వంతో పోలీసులు వాగ్వాదానికి దిగి దురుసుగా ప్రవర్తించారు. వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసు స్టేషన్ నుంచి వచ్చిన నాయకులు దీక్షా శిబిరాన్ని సిపిఎం కార్యాలయానికి మార్చారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి గవర్నర్ ఆమోదానికి పంపితే ఇప్పటికీ ఆమోదించలేదన్నారు. ఈ రిజర్వేషన్లు చట్టబద్ధం కావాలంటే రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్చడం ముఖ్యమైనదన్నారు. పార్లమెంట్‌లో చర్చించి చట్టం రూపంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బిజెపి ప్రభుత్వానిదని తెలిపారు. ఈ విషయంపై తెలంగాణలో ఉన్న ఇద్దరు బిజెపి కేంద్ర మంత్రులు నోరు మెదపడం లేదని విమర్శించారు. సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులు, పోలీసుల తీరును జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య, జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, బొల్లు యాదగిరి, బొడ్డుపల్లి వెంకటేష్, గంగదేవి సైదులు, మద్దేపూరం రాజు, గడ్డం వెంకటేష్, బల్గూరి అంజయ్య, కోట రామచంద్రారెడ్డి, నాయకులు వనంరాజు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్లపై ధర్నా చేస్తే అరెస్టులా?

- భువనగిరిలో సిపిఎం నాయకుల అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటులో చట్టం తేవాలనీ, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలంటూ భువనగిరిలో ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్‌తోపాటు రాష్ట్ర నాయకులు కొండమడుగు నర్సింహా, అనురాధ, మల్లేష్ తదితర నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఈ అరెస్టులను ఖండిస్తున్నామనీ, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. పార్లమెంటులో బిల్లు ఆమోదించడంలేదంటూ ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ధర్నా చేశారని పేర్కొన్నారు. అదే అంశంపై రాష్ట్రంలో సిపిఎం ధర్నా చేస్తుంటే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఇలాంటి ద్వంద్వ వైఖరి రాష్ట్ర ప్రభుత్వానికి తగదని పేర్కొన్నారు. ఉద్యమాలను అణచివేయాలనుకోవడం సరైంది కాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరగాలంటే ఈ ఉద్యమానికి సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరమున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

అతిథులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థిని

హోలీమేరీ కళాశాలలో 'స్మార్ట్‌వేస్ట్ మేనేజ్‌మెంట్'పై సెమినార్ విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కాళాశాలలో 'స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్' మెలకువలపై జరిగిన సెమినార్ విజయవతంగా ముగిసింది. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒయు ప్రొఫెసర్ కె.నవీన్ కుమార్, ఆర్‌సిఐ శాస్త్రవేత్త మల్లికార్జున హాజరయ్యారు. వెస్ట్ మేనేజ్ ప్రక్రియలో ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగమించేందుకు ఎఐ, డేటా అనలాటిక్స్ పనితీరును వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకుగానూ కళాశాల చైర్మన్ డాక్టర్ అరిమంద సిద్ధార్ధ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెబివి సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు డాక్టర్ ఎ.సతీష్, డాక్టర్ కృష్ణహరి, డాక్టర్ ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు.

జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రతి కవితా కరుణ రస ప్రధానమే

- ప్రముఖ గాయకుడు త్రినాధరావు

ప్రజాశక్తి - కల్చరల్

జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రతి కవితా కరుణ రస ప్రధానమేనని, కరుణశ్రీగా అయన సార్థక నామధేయుడని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ ఉన్నతాధికారి, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాధరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షతన శుక్రవారం జంధ్యాల పాపయ్య శాస్త్రి యాదిలో సమావేశం జరిగింది. సభలో పాల్గొన్న త్రినాధరావు మాట్లాడుతూ పాపయ్య శాస్త్రి రచించిన పుష్ప విలాపం మధుర గాయకుడు ఘంటసాల గానంతో జగద్విఖ్యాతి పొందిందన్నారు. అయన రాసిన పలు కావ్యాలు కుంతీ కుమారి అరుణశ్రీ తెలుగు సాహితీ సంపద అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గానసభ సభ్యుడు శంకర ప్రసాద్, ప్రముఖ వ్యాఖ్యాత పిఎంకె గాంధీ, గాయని మంగరాజు రుక్మిణి, జి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎత్తుల్ని చిత్తు చేసిన కార్మికులు

- కిర్బీలో నాలుగోసారి సిఐటియు గెలుపు..
- అంబరాన్నంటిన సంబురాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ పార్టీల ఎత్తులు, బెదిరింపులు, డబ్బు, మద్యం వంటి తాయిలాల కుయుక్తులను చిత్తు చేసి కార్మిక వర్గం చైతన్యంతో సిఐటియుకు పట్టం కట్టారు. ఒకటా రెండా నాలుగు రాజకీయ పార్టీలకు వంతపాడే కార్మిక సంఘాల కూటమిని చిత్తు చేసి సిఐటియును కార్మికులు గెలిపించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుని బెదిరింపులను సైతం లెక్కచేయకుండా నమ్ముకున్న యూనియన్‌కే ఓటు వేసి నాలుగో సారి విజయఢంకా మోగించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని కిర్బీ పరిశ్రమలో శుక్రవారం గుర్తింపు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సిఐటియు తరఫున ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు గుర్తింపు యూనియన్ అధ్యక్షులుగా పోటీ చేశారు. మరో పక్క బిఆర్‌టియు, ఐఎన్‌టియుసి, బిఎంఎస్, టిఎన్‌టియుసి కూటమి తరఫున బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు పోటీ చేశారు. పరిశ్రమలో 578 మంది కార్మికులు ఓటు కలిగి ఉన్నారు. 576 ఓట్లు పోలవ్వగా మరో 2 ఓట్లు చెల్లలేదు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు నక్షత్రం గుర్తుకు 295 ఓట్లు వచ్చాయి. బిఆర్‌టియు కూటమికి 281 ఓట్లు వచ్చాయి. 14 ఓట్ల మెజార్టీలో సిఐటియు నాలుగో సారి విజయదుందుభి మోగించింది. ఈ సందర్భంగా పరిశ్రమలో కార్మికులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు జెండా రెపరెపలాడింది. అనేక పరిశ్రమల్లో గెలుస్తూ వస్తున్న సిఐటియు కిర్బీ పరిశ్రమలోనూ తన పట్టును నిలపుకుంది. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బలపర్చిన టిఆర్‌టియు అభ్యర్థికి ఓటు వేయాలని, లేని పక్షంలో రాబోయే కాలంలో మీ అంతు చూస్తామంటూ ఎమ్మెల్యే సోదరుడైన మధుసూధన్‌రెడ్డి కార్మికులను బెదిరించి భయభ్రాంతులకు గురి చేశారు. కార్మికుల ఇళ్ల మీదికి వెళ్లి దౌర్జన్యం చేశారు. రాజకీయ పార్టీల ఎన్నికల మాదిరిగా కార్మికులకు మద్యం, డబ్బు పంపిణీ చేశారు. ఓట్లేయకపోతే అంతు చూస్తామని బెదిరించారు. అయినా కూటమి ప్రయత్నాలు సాగలేదు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఎర్రజెండా పని చేస్తున్నదని, కిర్బీ పరిశ్రమలో నాలుగోసారి సాధించిన విజయం.. కార్మికులకే అంకితమని గుర్తింపు ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోండి : వైద్యారోగ్యశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు బి.రవీందర్ నాయక్ సూచనలతో కూడిన ఒక ప్రకటన విడుదల చేశారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటివి దోమలతో విస్తరిస్తాయనీ, వాటి బారి నుంచి కాపాడుకోవాలని కోరారు. తలుపులు, కిటికీలు, పడకలకు మస్కిటో నెట్స్ వాటకం, ఇళ్లల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవడం, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. కాచి వడబోసిన నీటిని తాగాలనీ, భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలనీ, బయటి ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా అనారోగ్యంతో ఉన్న వ్యక్తులతో చేతులు కలపకూడదని తెలిపారు. తుమ్ములు, దగ్గు వచ్చినప్పుడు తప్పనిసరిగా చేతిరుమాలు ఉపయోగించాలి. ఎవరైనా అత్యవసర పరిస్థితిలో ఉంటే వెంటనే 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స కోసం ప్రత్యేక బెడ్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

భారీ పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానం

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో భారీ పెట్టుబడులే లక్ష్యంగా నూతన పారిశ్రామిక విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా రుద్రారంలో రూ.562 కోట్లతో ఏర్పాటు చేసిన తోషిబా విద్యుత్ పరికరాల రెండు యూనిట్లను కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామితో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. మరో యూనిట్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తోషిబా విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమలో ప్రారంభించిన ఈ యూనిట్ల ద్వారా 400 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనతి కాలంలోనే తెలంగాణ తయారీ రంగంలో దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. 2024-25లో ఇండస్ట్రియల్ అవుట్ పుట్ రూ.2.77 లక్షల కోట్లు అని, ఇందులో 48 శాతం వాటా తయారీ పరిశ్రమ రంగానిదేనని తెలిపారు. 9 నెలల్లోనే రూ.లక్ష కోట్ల విలువైన మార్చండైజ్ ఎక్స్‌పోర్ట్స్ రాష్ట్రం నుంచి జరిగాయనీ, జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం, ఇది జాతీయ సగటు కంటే ఎక్కువని చెప్పారు. తెలంగాణను 'రెన్యువబుల్స్ ఇంజిన్ ఆఫ్ ఇండియా'గా మార్చాలనే సంకల్పంతో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే క్లీన్ ఎనర్జీలో రూ.29వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని అన్నారు. 2030 నాటికి న్యూ రెన్యువబుల్ కెపాసిటీని 20వేల మెగావాట్లకు పెంచేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన సందర్భంగా చేసుకున్న అవగాహన ప్రకారం కొత్త ప్లాంట్ ప్రారంభం అయిందన్నారు. రూ.562 కోట్ల పెట్టుబడులకు సంబంధించి తోషిబా కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ చేసుకుందని తెలిపారు. టెక్నాలజీలో తోషిబా ఒక ప్రత్యేకమైనదని, ఈ కంపెనీ జపాన్ బుల్లెట్ ట్రైన్ కంటే ఫాస్ట్‌గా వస్తువులు తయారీ చేస్తుందన్నారు. ఈ పెట్టుబడులతో ఎనర్జీ రంగంలో తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా పాలసీని అమలు చేస్తోందనీ, యువతకు నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ప్రోత్సాహం, ఆధునిక టెక్నాలజీ పరిజ్ఞానం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానం అమలు చేస్తున్నామని, అలాగే ఉద్యోగ కల్పనలోనూ తెలంగాణ ముందుందని తెలిపారు. ఐటీ క్యాపిటల్‌గా హైదరాబాద్ ఎదుగుతుందని, సంగారెడ్డికి రైసింగ్ కారిడార్‌గా రుద్రారం మారుతుందని చెప్పారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగానే విద్యుత్ పరికరాల తయారీ కంపెనీలు ఉండాలని ఆకాంక్షించారు. తోషిబా ఈ విషయంలో ముందు వరసలో ఉందన్నారు. స్కిల్ ఇండియా యూనివర్సిటీ, డీట్ లాంటి నూతన ఉద్యోగ, ఉపాధి కేంద్రాలను ప్రారంభించామని అన్నారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. పరిశ్రమలో నూతన ఉద్యోగాల కల్పన ద్వారా కార్మికుల జీవితాల్లో వెలుగులు పంచాలన్నదే తన సంకల్పమన్నారు. తోషిబాలో ఆధునిక టెక్నాలజీని వాడుతున్నారని, తద్వారా కార్మికులకు శ్రమ తగ్గుతుందని చెప్పారు. ఈ ప్రాంత పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులకు దారితీయనున్నాయని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై తోషిబా ప్రతినిధులు

ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

- ప్రజలకు మంత్రి దామోదర రాఖీ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కుటుంబ బంధాలకు, తోబుట్టువుల ప్రేమ, ఆప్యాయలకు సాక్ష్యంగా నిలిచే విశిష్టమైన రాఖీ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అడబిడ్డలకు ప్రజాప్రభుత్వం పెద్దన్నలాగా అండగా నిలుస్తున్నదని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి మిషన్ పాలసీని ప్రారంభించుకున్న మహిళల ఆర్థిక సాధికారతకు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని చెప్పారు. దాదాపు రూ.21 వేల కోట్లకుపైగా వడ్డీలేని రుణాలను మహిళలకు అందజేశామని మంత్రి తెలిపారు.రాఖీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మంత్రి ప్రత్యేకంగా ఒక విజ్ఞప్తి చేశారు. ఈ నెల 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని రాఖీ కట్టే సమయంలో తమ అక్కాచెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు తెలియజేయాలని కోరారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న పిల్లలందరికీ ఈ మాత్రలు వేయించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

కోర్టు నోటీసు

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
O. S. No. 29 OF 2010

Between: -
Voonna Sarveswara Rao .....Plaintiff.
And: -
Jampana Rajeswari Devi and others ....Defendants.

To,
D-5: Jampana Lakshmi D/o late Atchuta Ramaraju, aged about 40 years house hold duties presently residing at Lakshminagar picket, Plot No. 13 in Secunderabad city, Telangana State.
D-6: Jampana Sujatha, D/o late Atchuta Ramaraju, aged about 38 years --Rest Do--
D-7: Jampana Sridevi, D/o late Atchuta Ramaraju, aged about 36 years --Rest Do--
D-8: Jampana Anuradha, D/o late Atchuta Ramaraju, aged about 32 years --Rest Do--

పై కోర్టులో వాది పై నెంబరు దావా దాఖలు చేయగా 2వ ప్రతివాది కాలం చేసినందున ఆమె వారసులుగా మీరు 5 నుండి 8 ప్రతివాదులుగా పై దావాలో చేరినందున పై కోర్టు వారు మీ యొక్క నోటీసు నిమిత్తము **తే 20-8-2025 దికు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా వేసినారు.** కావున పై తేది నాడు **ఉదయం 10-30 గం॥ లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరుచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షంగా పై నెంబరు కేసును తీర్మానించడమగునని ఇందుమూలముగ తెలియపరచడమైనది.

ఎన్.వి.శేషగిరి రావు, అడ్వకేట్,
శ్రీకాకుళం, ఫోన్: 9440069414

కోర్టు నోటీసు

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
O. S. No. 28 OF 2010

Between: -
Saradambika Infrastructures & Real Estates Pvt. Ltd., Hyderabad represented by its Managing Director, Voonna Nagaraju. ......Plaintiff.
And: -
Jampana Rajeswari Devi and others ....Defendants.

To,
D-5: Jampana Lakshmi, D/o late Atchuta Ramaraju, aged about 40 years, house hold duties presently residing at Lakshminagar picket, Plot No. 13 in Secunderabad city, Telangana State.
D-6: Jampana Sujatha, D/o late Atchuta Ramaraju, aged about 38 years --Rest Do--
D-7: Jampana Sridevi, D/o late Atchuta Ramaraju, aged about 36 years --Rest Do--
D-8: Jampana Anuradha, D/o late Atchuta Ramaraju, aged about 32 years --Rest Do--

పై కోర్టులో వాది పై నెంబరు దావా దాఖలు చేయగా 2వ ప్రతివాది కాలం చేసినందున ఆమె వారసులుగా మీరు 5 నుండి 8 ప్రతివాదులుగా పై దావాలో చేరినందున పై కోర్టు వారు మీ యొక్క నోటీసు నిమిత్తము **తే 20-8-2025 దికు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా వేసినారు.** కావున పై తేది నాడు **ఉదయం 10-30 గం॥ లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరుచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షంగా పై నెంబరు కేసును తీర్మానించడమగునని ఇందుమూలముగ తెలియపరచడమైనది.

ఎన్.వి.శేషగిరి రావు, అడ్వకేట్,
శ్రీకాకుళం, ఫోన్: 9440069414

ప్రజావాణిలో పలు సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణిలో వచ్చిన పలు సమస్యలను పరిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సిఎం ప్రజావాణిలో 199 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ స్వీకరించారు. ప్రజల సమస్యలను విన్నారు. ఆ సమస్యల విషయమై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 55, రెవెన్యూ శాఖకు సంబంధించి 19, మున్సిపల్ శాఖకు 19, ప్రవాసి ప్రజావాణికి 02, ఇందిరమ్మ ఇండ్ల కోసం 54 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 50 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

మూసీ ప్రాజెక్టు ఐదు గేట్ల ఎత్తివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో శుక్రవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో ఉన్న మూసీ ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను అధికారులు ఎత్తారు. దిగువకు 9600 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 2,3,7,8,10 గేట్లను మూడు అడుగుల మేర పైకి ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 4136 క్యూసెక్కుల వరద నీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుతం 643.30 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.02టీఎంసీలుగా ఉంది.

దోస్త్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 12 వరకు పొడిగింపు

- 13, 14 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యూ, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిసిఎ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రత్యేక విడత కౌన్సెలింగ్‌లో భాగంగా సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును ఈనెల 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఎ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ ప్రత్యేక విడతలో 54,048 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించిన విషయం తెలిసిందే. సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు శుక్రవారం వరకే అని ప్రకటించాయి. భారీ వర్షాలు, వరలక్ష్మి వ్రతం కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు వచ్చాయి. దీంతో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును ఈనెల 12 వరకు పొడిగించామని తెలిపారు. కాలేజీల్లో రిపోర్టు చేసే గడువు కూడా ఈనెల 12 వరకు పొడిగించామని పేర్కొన్నారు. ప్రయివేటు డిగ్రీ కాలేజీలు, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో (సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు మాత్రమే) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

లీగల్ నోటీసు

To,
దోగిపర్తి సుధీర్ కుమార్ తండ్రి నాగేశ్వరరావు, రామచంద్రపురం, మెదక్, హైదరాబాద్, తెలంగాణరాష్ట్రం.

నా క్లయింట్లు అయిన 1.వెలిశెట్టి వెంకటేశ్వర్లు తండ్రి నరసయ్య(లేట్), నివాసం పొదిలి గ్రామం, పొదిలి మండలం, ప్రకాశం జిల్లా, 2. నగరం నాగరాజు, తండ్రిమల్లికార్జునరావు, కొరిటపాడు, గుంటూరు, గుంటూరు టౌన్, గుంటూరు జిల్లా, అనువారు మాకు ఇచ్చిన సంజాయిషీ పురస్కరించు కొని యావన్మందికి తెలియజేయునది ఏమనగా.....

తెలంగాణరాష్ట్రం,హైదరాబాద్, మెదక్, జ్యోతి నగర్, రామచంద్రపురం కాపురస్తుడు దోగిపర్తి సుధీర్ కుమార్, తండ్రి నాగేశ్వరరావు, అయిన నీవు, నీకు హక్కు గల రిజిస్టర్ విక్రయ దస్తావేజు నెంబర్:3833/2016, తేదీ:10-10-2016న పొదిలి సబ్ రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ చేయించుకున్న ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని నీవు, నా క్లయింట్లకు విక్రయించుటకు ఖరారు చేసుకుని విక్రయ ఖరారు మొత్తము రూ. 1,20,00,000/-(అక్షరముల ఒక కోటి ఇరవై లక్షల రూపాయలు) దానిలో అడ్వాన్సుగా రూ. 20,00,000/- (అక్షరముల ఇరవై లక్షల రూపాయలు) మధ్యవర్తులు అయిన కలువా వెంకటేశ్వర్లు, కలువా మోహన్ వారి ద్వారా నీవు రొక్కము తేదీ11-11-2022 నా పొంది తదుపరి కాల పరిమితి లేకుండా రిజిస్టర్ రోజున మిగతా క్రయ ధనము ఇచ్చేటట్లు ఒప్పందం కుదుర్చుకుని ఉన్నారు. తదుపరి షెడ్యూల్ ఆస్తి విలువ పెరిగినందు వలన నీకు దుర్బుద్ధి పుట్టి, మోసపూరితముగా, దుష్ట ఆలోచనతో, మిగతా క్రయ ధనముతో నా క్లయింట్లు సిద్ధంగా ఉన్నను, నీవు కావాలని కాలయాపన చేయుచూ, వేరే వారికి అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నారని నా క్లయింట్లకు తెలిసి వచ్చినది. ఒకవేళ ఆ విధంగా అమ్మినను, వేరే వారు కొనినను చట్ట ప్రకారం చెల్లదని యావన్మందికి తెలియజేయడం అయినది. అంతేగాక నా క్లయింటు శ్రీ మార్కాపురం ఆరవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో దావా వేసి నీపై ఈ షెడ్యూలు ఆస్తిని పొందడమే కాక, అందుకు అయ్యే యావత్తు ఖర్చులు వసూలు చేయడమే కాక, నీపై తగిన క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా ఒంగోలు స. రి., పొదిలి స. డి, పొదిలి మండలం, పొదిలి నగర పంచాయతీ, పొదిలి గ్రామ సర్వేనెంబర్:174/1రు దాఖలా య.1.65 సెంట్లు, సర్వేనెంబర్:174/2రు య.0.79 సెంట్లు, మొత్తం వెరసి య.2.44 సెంట్లు భూమికి హద్దులు :- **తూర్పు:** నీ తాలూకు భూమి. **దక్షిణం:** నీ తాలూకు భూమి. **పడమర:** కొండవేటి రామచంద్రరావు వగైరా భూములు. **ఉత్తరం:** కొండవేటి రామచంద్రరావు వగైరాల భూమి.

ఈ హద్దులలో య.2.44 సెంట్లు భూమిన్నూ మరియు మామూలు దారి హక్కులతో సహా.

ప్రదేశం: పొదిలి
తేదీ :08-08-2025

ఇట్లు
బొమ్మరాజు సురేష్ కుమార్,
అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ :9866280305.

తల్లీకూతురు దారుణ హత్య

- జనగామ జిల్లా జఫర్‌గడ్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తల్లీ కూతురును గుర్తు తెలియని దుండగులు అతి దారుణంగా హత్య చేసిన సంఘటన జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి-ఐ గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మడపల్లి-ఐ గ్రామానికి చెందిన గాలి రాణమ్మ (58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త జాజిరెడ్డి 35 ఏండ్ల కిందట మృతి చెందాడు. జాజిరెడ్డికి ఇద్దరు భార్యలు, మొదటి భార్య చనిపోగా, ఆమె చెల్లెలు రాణమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. రాణమ్మకు ఒక కూతురు, మొదటి భార్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. దేవరుప్పుల మండలం నిరుమల గ్రామానికి చెందిన రాణమ్మ తల్లి అన్నమ్మ (93) పదేండ్లుగా కూతురు వద్దే ఉంటోంది. అన్నమ్మకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నప్పటికీ రాణమ్మ వద్దే ఉంటుంది. తల్లి పోషణ నిమిత్తం రాణమ్మకు రెండెకరాల భూమి అన్నమ్మ ఇచ్చింది. ఈ క్రమంలో గురువారం రాత్రి రాణమ్మ ఇంట్లోకి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి అన్నమ్మను ఇనుప రాడ్లతో కొట్టి చంపారు. గమనించిన రాణమ్మ అడ్డుకునే ప్రయత్నం చేయగా అదే ఇనుప రాడ్డుతో ఆమె తలపై కొట్టి చంపారు. రాణమ్మ మృతదేహం కనిపించకుండా ఆరుబయట పరదా కప్పి పరారయ్యారు. ఉదయాన్నే ఇంట్లో పనిచేసేందుకు వచ్చిన పనిమనిషి కూతురు గుర్తించి వారి సమీప బంధువులకు తెలిపింది. వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు జాగిలాలతో, క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఏసీపీ అంబటి నరసయ్య, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రామ్ చరణ్.. ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బంగారం, డబ్బు ఎలాంటి దొంగతనం జరగలేదని నిర్ధారించారు. భూ తగాదాలే కారణమై ఉండొచ్చని పోలీసులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

మోడీ ప్రభుత్వ ఏజెంటు 'ఇసి'

- బిజెపికి ప్రతికూల పరిస్థితులు ఉన్నచోట ఓట్ల తొలగింపు
- ఇప్పటికే బీహార్‌లో 62 లక్షల ఓట్లు గల్లంతు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య

ఆర్‌టిసి క్రాస్ రోడ్డులో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా ఎన్నికల కమిషన్ పనిచేస్తున్నదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన నిరసన సభలో వీరయ్య మాట్లాడుతూ.. బీహార్‌లో అక్రమంగా, అప్రజాస్వామికంగా 62 లక్షల ఓటర్లను రకరకాల పేరుతో తొలగించే ప్రక్రియకు ఇసి ఒడిగట్టిందని విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(సర్) పేరుతో ఒక్క నెలలోనే ఇన్ని ఓట్లను తొలగించిందని తెలిపారు. నిరుపేదలు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ పేదలను ఓటర్ల లిస్టులో నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి ఓట్లు పడవని భావించిన ప్రతీ చోటా ఏదో ఒక పేరుతో వాళ్ల ఓట్లను తొలగించే కుట్రకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఇది అప్రజాస్వామిక చర్య అనీ, అందుకే సిపిఎం దీన్ని వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ప్రతి పక్ష పార్టీలన్నీ కూడా వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. అయినా మోడీ ప్రభుత్వానికి ఏజెంటుగా వ్యవహరిస్తూ, ఊడిగం చేస్తున్న ఇసి ఉలుకూ పలుకు లేకుండా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఇదొక కుట్ర పూరితమైన ప్రక్రియ అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉండాల్సిన మోడీ..ప్రధాన మంత్రి స్థానంలో ఉన్నారనే విషయాన్ని అనేక ఆధారాలు బట్టబయలు చేస్తున్నాయని వివరించారు. పోలైన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు ఎలా ఎక్కువగా ఉంటాయో..ఇసి సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్నదని విమర్శించారు. ఐదు కోట్ల ఓట్లు అదనంగా లెక్కించిన ఫలితంగా బిజెపికి 70సీట్లు తోడయ్యాయని తెలిపారు. అదనపు ఓట్లు ఎక్కడ పోలయ్యాయో అక్కడ బిజెపి గెలిచిందని గుర్తు చేశారు. ఓటింగ్ ముగిసే సమయానికి ప్రకటించిన పోలైన ఓట్ల సంఖ్యకు తుది సంఖ్యకు చాలా తేడా ఉందని చెప్పారు. దేశ చరిత్రలో 1.2 శాతం మించి తేడా లేదని తెలిపారు. కానీ..ఇసి మోడీ జేబు సంస్థగా మారిన తర్వాత పది శాతం వరకు తేడా వచ్చిందని గుర్తు చేశారు. 24గంటల్లో తేల్చాల్సిన పోలింగ్ లెక్కలకు పది రోజుల సమయం తీసుకుంటున్న నియోజక వర్గాలు, రాష్ట్రాలున్నాయని వివరించారు. ఈ విషయం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యాణ, యుపిలో రుజువైందని గుర్తు చేశారు.మహారాష్ట్రలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు మధ్య ఐదు మాసాల్లో కోటి ఓట్లు పెరిగాయని చెప్పారు. ఆయా నియోజక వర్గాల్లో జరిగిన తంతంగాన్ని వెల్లడించాలనీ, సీసీపుటేజీలను బయటపెట్టాలని ప్రతిపక్ష పార్టీలన్నీ డిమాండ్ చేసినా పట్టించుకోవటం లేదని తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ పద్ధతి ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో బిజెపి ఓడిపోబోతున్నదనే సంకేతాలతో సర్ పేరుతో 2003 తర్వాత ఓటర్లుగా ఉన్నవారి బర్త్ సర్టిఫికెట్ ఇవ్వాలంటున్నారనీ, అంతటితో ఆగకుండా వాళ్ల తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలను అడుగుతున్నారని తెలిపారు. సాధారణ వ్యవసాయ, అసంఘటిత కార్మికులకు బర్త్ సర్టిఫికెట్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. బిజెపి అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలిస్తే దేశంలో ఒక భయానక పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని కేవలం బీహార్‌కు సంబంధించిన విషయంగానే చూడొద్దని సూచించారు. రానున్న కాలం గడ్డు కాలంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలకు, ప్రజాస్వామిక వాదులపైనా ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం వెంకటేశ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, రాష్ట్రకమిటీ సభ్యులు ఎంవీ రమణ, పి.ఆశయ్య, భూపాల్, బాబూరావు, నగర నాయకులు ఎం శ్రీనివాస్, ఎం శ్రీనివాస్‌రావు, మహేందర్, ఎం. దశరథ్, ఆర్ వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా నాయకులు చంద్రమోహన్, కవిత, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

సెకెండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా టివివిపి అప్‌గ్రేడ్

- మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి)ను త్వరలో సెకెండరీ హెల్త్ డైరెక్టరేట్‌గా టివివిపి అప్‌గ్రేడ్ చేయనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు ఉద్యోగోన్నతులు కల్పించిన నేపథ్యంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టివివిపిలో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) 1,690 డాక్టర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేసేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. నాన్ టీచింగ్ విభాగంలో డిఎంఇ, డిహెచ్, టివివిపిల్లో టైం బాండ్ ప్రమోషన్ల భర్తీలో వయోపరిమితి పెంపుపై కామన్ నిబంధనలు రూపొందించటానికి ఎక్స్‌పర్ట్ కమిటీ నియమిస్తామని తెలిపారు. మంత్రి నిర్ణయాలను డాక్టర్ల సంఘం ప్రతినిధులు స్వాగతించారు. సెకెండరీ హెల్త్‌గా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. డాక్టర్ల పోస్టుల భర్తీకి మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. డాక్టర్ల సమస్యలపై ప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్, నాయకులు డాక్టర్ రవూఫ్, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ గోపాల్, డాక్టర్ క్రాంతి, డాక్టర్ అశోక్, డాక్టర్ రామ్ సింగ్ లు పాల్గొన్నారు.

అలీబాబా 40 దొంగల్లా కల్వకుంట కుటుంబం

- పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అలీబాబా 40 దొంగల్లా కల్వకుంట్ల కుటుంబం దోపిడీకి పాల్పడిందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విమర్శించారు. అందులో బిఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఒకరి అని తెలిపారు. ఆ దొంగలకు కెసిఆర్ కుటుంబానికి పెద్ద తేడా లేదని ధ్వజమెత్తారు. కెసిఆర్ కుటుంబం అవినీతికి కేరాఫ్ అడ్రస్ అని ఆరోపించారు. ఈ రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకుని నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ దొంగల్లో ప్రభాకర్ రెడ్డి కూడా ఓ దొంగ అని విమర్శించారు. కల్వకుంట్ల కవిత ఢిల్లీలో లిక్కర్ దుకాణం తెరిచారని ఆరోపించారు. కవిత, కేజ్రీవాల్ కథ ముగిందన్నారు. పెద్దమ్మ గుడి కమాన్ నుంచి మాదాపూర్ దాకా రాత్రి రెండు గంటల వరకు లిక్కర్, పబ్బు దందాలు కేటీఆర్ బావమరిది సంతోష్‌వేన్నారు. రూ. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.30 వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు ఇచ్చిన డబ్బులను లెక్కలేసుకునేందుకే కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు ఎవర్ని రానివ్వడం లేదని ఎద్దేవా చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి 'నీవ్వెంత నీ బతుకెంతా'? తన గురించి మాట్లాడే నైతికత ఉందా? అని ప్రశ్నించారు. ఆయన మాదిరిగా తాను ప్యాకేజీ లీడర్‌ను కాదన్నారు. ఆయన దగ్గరున్నంత ఆస్తి తన దగ్గరుంటే రైతులకు పంచుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రులు రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని చెప్పారు. కేంద్రమంత్రిగా ఆయనకు అవకాశం వచ్చిందనీ, రాష్ట్రానికి ఉపయోగపడే పని ఒక్కటైనా చేయాలని ఆయన హితవు పలికారు.

'బండి'వి అడ్డగోలు మాటలు

- 48 గంటల్లో క్షమాపణ చెప్పకుంటే కోర్టుకీడుస్తా
- కేంద్ర మంత్రికి కెటిఆర్ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్ని హద్దులు దాటారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలను తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ఇలాంటి అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు కెటిఆర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం నిజమున్నా నిరూపించాలని సవాల్ విసిరారు. తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు లీగల్ నోటీసు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే 48 గంటల గడువు తర్వాత బండి సంజయ్‌ని కోర్టుకీస్తానని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో తెలియకుండానే వాస్తవాలను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. సాక్ష్యం కూడా లేకుండా తమపై ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుతున్నారని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కి నిఘా వ్యవస్థల పని తీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత జ్ఞానం కూడా లేదని చురకలంటించారు. కేంద్ర మంత్రిగా పని చేయడమంటే, ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన ప్రతిసారి బండి సంజయ్ మరింత దిగజారుడుతనానికి లోనవుతున్నారని తెలిపారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజకీయాల్లో పెద్ద జోకర్‌గా మారిన బండి సంజయ్ పతాక శీర్షికల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- సిఎస్‌కు హెచ్‌ఆర్‌సి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా శక్తి కేంద్రాల్లో పనిచేస్తున్న సోషల్ కౌన్సెలర్లు, లీగల్ కౌన్సెలర్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న అన్ని వేతనాలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన కమిషన్ ఈ తీర్పునిచ్చింది. వీరికి 2019 ఏప్రిల్ నుంచి జీతాలు అందలేదనీ, సేవలు అందించే వ్యక్తులకు వేతనాలు నిరాకరించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం వారి జీవనోపాధి హక్కు, గౌరవంగా జీవించే హక్కును ఉల్లంఘిస్తుందని కమిషన్ పేర్కొంది. దీర్ఘకాలంగా జీతాలు చెల్లించకపోవడంతో వారి మానసిక, శారీరక, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని, వారి కుటుంబాలు, జీవన నాణ్యతపై ప్రభావం చూపుతుందని పేర్కొంది.

బిఇడి ఉన్న ఎస్‌జిటిలకు పిఎస్‌హెచ్‌ఎం ఉద్యోగో న్నతులు కల్పించాలి

- సిఎం ప్రత్యేక కార్యదర్శికి టిఆర్‌టిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఇడి ఉన్న ఎస్‌జిటిలకు ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్ (పిఎస్‌హెచ్‌ఎం) పోస్టులకు ఉద్యోగోన్నతులను కల్పించాలని టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, మెదక్ జిల్లా అధ్యక్షులు మెంగరి ప్రణీద్‌కుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని పండితులు, పిఇటి పోస్టులను పంచాయతీరాజ్ పాఠశాలల తరహాలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. పిఎస్‌హెచ్‌ఎం పోస్టులు ఏర్పాటు చేసినప్పటి నుంచి అప్పటి ఉత్తర్వులే ఉన్నాయని తెలిపారు. 2009లో వెలువడిన ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఏపీలో 2017లో నూతన ఉత్తర్వులు తీసివేసినా అర్హతల విషయంలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. అదే ఉత్తర్వులతో ఎపిలో పిఎస్‌హెచ్‌ఎంఉద్యోగోన్నతులు పొందుతున్నారని వివరించారు. ఎన్‌సీటీఈ నోటిఫికేషన్‌లో నియామకాలు కూడా మినహా యింపు ఉన్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేసిందని తెలిపారు. తప్పనిసరైతే ఆరు నెలల బ్రిడ్జ్ కోర్సు కేంద్రం ఇచ్చిన వెసులుబాటును పరిశీలించి బిఇడి ఉన్న ఎస్‌జిటిలకు పీఎస్‌హెచ్‌ఎం ఉద్యోగోన్నతులను కల్పించాలని సూచించారు. అందుకు అవసరమైన నిబంధనలను సవరించాలని కోరారు.

నిండుకుండల్లా జంట జలాశయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాలు నిండుకుండలా మారాయి. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయాలకు వరద నీరు భారీగా చేరుతోంది. నీటి మట్టం పెరగడంతో అప్రమత్తమైన అధికారులు గురువారం రాత్రి హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ ఒక గేటును అడుగు మేర ఎత్తారు. శుక్రవారం ఉదయం మరో మూడు గేట్లను ఎత్తిన అధికారులు హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ నుంచి దాదాపు 1391 క్యూసెక్కుల నీటిని మూసీ నదిలోకి వదిలారు. హిమాయత్‌సాగర్‌కు 1300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. హిమాయత్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1763.30 అడుగులకు చేరింది. ఉస్మాన్‌సాగర్‌కు 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుతం 1783 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ఉస్మాన్‌సాగర్ పూర్తిగా నిండే అవకాశముంది.

మతం పేరుతో రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతం పేరుతో రిజర్వేషన్లను అడ్డుకోవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని రాజకీయ పార్టీలకూ విజ్ఞప్తి చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం చేశామని, అందులో మతపరమైన రిజర్వేషన్‌కు స్థానం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో నూతనంగా బీసీ సెల్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో బిసి సెల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. బిసిలు ఒక్క గొంతుక కావాలని పిలుపునిచ్చారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరినా గత పాలకులు అడ్డు కాలు చేశారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3,4 ప్రకారం బిసి రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. వ్యవసాయానికి, వ్యవసాయ విశ్వవిద్యాలయ భద్రతకు తమ ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందని తెలిపారు. సిడ్నీ విశ్వవిద్యాలయంతో సంప్రదింపులు, ఒప్పంద ప్రక్రియకు ప్రభుత్వపరంగా సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. వీసీ అల్దాస్ జానయ్య నేతృత్వంలో ప్రవేశపెట్టిన నూతన కోర్సులకు, విదేశీ విద్య అభ్యసించేందుకు ఆర్థిక చేయూతనిస్తామన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని వ్యవసాయ కళాశాలల వద్ద విద్యార్థులు, సిబ్బందికి రవాణా సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఆయా సమయాల్లో అందుబాటులో తిరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ విభాగ అభివృద్ధికి ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తన నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు ఒక బిసి బిడ్డగా ప్రధాని, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కోరారు.

ఫెర్నాండెజ్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ వారోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ప్రైవేట్ వైద్య సేవల సంస్థ ఫెర్నాండెజ్ హాస్పిటల్ ప్రపంచ బ్రెస్ట్ ఫీడింగ్ వీక్‌లో భాగంగా ఆగస్టు 1-7 వరకు హైదరాబాద్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఇన్ఫర్మేషన్ సెషన్స్, తల్లిపాల గురించి అపోహలు-వాస్తవాలు, చిట్కాలు, బ్రెస్ట్ పంప్స్, పాల నిల్వపై సమాచారం, కళా పోటీలు జరిగాయి. "బ్రెస్ట్ ఫీడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వండి- స్థిరమైన మద్దతు వ్యవస్థ సృష్టించండి" అనే థీమ్‌తో, తల్లి-బిడ్డ బంధాన్ని పెంచేందుకు వైద్యులు, నర్సులు, మంత్రసానులతో కలిసి ఏడు రోజుల వీడియో సిరీస్ ద్వారా ప్రచారం చేశామని ఆ హాస్పిటల్ నియోనాటాలజీ హెడ్ డాక్టర్ తేజో ప్రతాప్ ఒలేటి తెలిపారు. "సాధారణంగా తల్లి-శిశువు బంధాన్ని సెలబ్రేట్ చేసుకుంటాం, కానీ దానిని నిలబెట్టుకోవడానికి అందరి భాగస్వామ్యం అవసరమని మర్చిపోతాము. మీరు ఒంటరివారు కాదని చెప్పడానికి మార్గంగా ఈ ప్రచారం నిర్వహించాం . అందరం కలిసి తల్లిపాలను ప్రోత్సహించడమే కాకుండా, దానిని ప్రారంభించే వ్యవస్థను నిర్మించడానికి మేము కట్టుబడి ఉన్నాము." అని తేజో ప్రతాప్ తెలిపారు.

సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపకుడి జయంతి వేడుకలు

ప్రభుత్వ రంగం లోని సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సోరాబ్‌జీ పోచ్‌ఖానావాలా 144 వ జన్మదినాన్ని ఆ బ్యాంక్ వేడుకగా నిర్వహించింది. 1911లో స్థాపితమైన ఈ బ్యాంక్, భారతదేశంలో మొదటి స్వదేశీ వాణిజ్య బ్యాంక్‌గా పేరుగాంచింది. ఈ కార్యక్రమానికి ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంవి మురళి కృష్ణ, జోనల్ హెడ్ ధరసింగ్ నాయక్, రీజియనల్ హెడ్ పర్థ సారథి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా, బ్యాంక్ తన స్థాపకుడి వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఆర్థిక చేరువ, సమగ్ర బ్యాంకింగ్, ఎం ఎస్ ఎం ఇ లు, వ్యవసాయం, డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా సేవలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 4,500 శాఖలకు విస్తరించి సేవలు అందిస్తున్నట్లు తెలిపింది.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమ

13న నిరసనలు, దిష్టిబొమ్మ దహనాలు

- 22న ఎంపిలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు
- రైతు వ్యతిరేక చట్టాలు, లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలి
- ట్రంప్ విధానాలతో దేశ రైతాంగంపై తీవ్ర ప్రభావం
- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్‌లో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 13న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్టు పలువురు వక్తలు ప్రకటించారు. ఆ రోజు మోడీ దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 22న నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. మోడీ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎంపిలంతా పార్లమెంట్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త రౌండ్ టేబుల్ సమావేశం ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ అధ్యక్షతన జరిగింది. అందులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, జక్కుల వెంకన్న, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ.రమ, కోశాధికారి వంగూరు రాములు, టియుసిఐ జాతీయ కమిటీ సభ్యులు వి.ప్రవీణ్, రాష్ట్రనాయకులు ప్రదీప్, ఐఎఫ్‌టియు ఆఫీస్ బేరర్లు అనురాధ, అరుణ, తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ట్రంప్ దూకుడుతో మన దేశం ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధించడం, వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాలని చేస్తున్న ఒత్తిళ్లు దేశ వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం పడుతాయని హెచ్చరించారు.

పెళ్లైన మూడు రోజులకే యువతి మృతి

- పిజి ఎంట్రన్స్ పరీక్ష రాసి వస్తుండగా ఢీకొట్టిన లారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెళ్లైన మూడు రోజులకే యువతి ప్రాణం కోల్పోయింది. పరీక్ష రాసి వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ రాజీవ్ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని అఖిల డిగ్రీ పూర్తి చేశారు. మూడు రోజుల కిందటే ఆమెకు గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన రాజుతో వివాహం జరిగింది. శుక్రవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో అఖిల పీజీ ఎంట్రన్స్ పరీక్ష రాశారు. ఆ తర్వాత భర్త రాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంతో లారీ ఢీకొట్టింది. దాంతో ముద్దసాని అఖిల (22) అక్కడికక్కడే మృతి చెందారు. భర్త రాజుకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అఖిల మరణంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతురాలి తండ్రి ముద్దసాని నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎల్‌ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

మావోయిస్టుల పేరుతో రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాపింగ్

- సిట్ విచారణకు హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టుల పేరుతో రాజకీయ నాయకుల ఫోన్లతో పాటు వ్యాపారులు, సెలబ్రిటీలు, విద్యావేత్తల ఫోన్లను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ చేశారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ కుట్ర పూర్తిగా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్, ఆయన కుమారుడు కెటిఆర్‌ల పర్యవేక్షణలోనే సాగిందని ఆయన తెలిపారు. శుక్రవారం దిల్‌ఖుషా గెస్ట్‌హౌజ్‌లో ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తు జరుపుతోన్న సిట్ అధికారుల ఎదుట బండి సంజయ్ హాజరై సుదీర్ఘ వాంగ్మూలం ఇచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా తన ఫోన్‌తో పాటు తన డ్రైవరు, వ్యక్తిగత సిబ్బంది, కుటుంబీకుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని ఆయన అన్నారు. మావోయిస్టుల వంటి వామపక్ష తీవ్రవాదుల కార్యకలాపాలను అరికట్టటానికి పని చేయాల్సిన ఎస్ఐబి కార్యాలయాన్ని ఆ ముసుగులో పూర్తిగా స్వలాభం కోసం కెసిఆర్, కెటిఆర్‌లు వాడుకున్నారని విమర్శించారు. తన ఫోన్లేగాక విపక్షాలకు చెందిన చాలా మంది నాయకుల ఫోన్లను, వ్యాపారుల ఫోన్లను, చివరికి సినీప్రముఖుల ఫోన్లనూ ట్యాపింగ్ చేశారని ఆయన తెలిపారు. స్వయానా కవిత, ఆమె భర్త ఫోన్లనూ వదిలిపెట్టలేదని అన్నారు. మరోవైపు తన సహచర మంత్రుల ఫోన్లు, సొంత ఎమ్మెల్యేల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయించినట్టు తనకు సిట్ అధికారులు చూపిన జాబితాతో బయటపడిందని కేంద్రమంత్రి వివరించారు.

బిసిల 42 శాతం రిజర్వేషన్లపై చట్టం

- రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలనీ, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనే ద్వంద వైఖరికి నిరసనగా బిసిలంతా పోరాడాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం కార్యాలయంలో ఆఫీసు బేరర్ల సమావేశాన్ని ఎదునూరి మదార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలోని బిసిలకు 42 శాతం అమలు ద్వారా విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి, ఆర్డినెన్స్ ద్వారా కేంద్రానికి పంపించిందని పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. ఆ బిల్లుకు ఆమోదం తెలపకుండా కాలయాపన చేస్తూ బిసిలను వంచిస్తోందని తెలిపారు. బిల్లును ఆమోదించి కేంద్రం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో వివిధ వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.